విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో
పనిచేయుటకు ఉత్సాహవంతులైన

జిల్లా బ్యూరో చీఫ్‌లు | జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌లు
నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు | మండల రిపోర్టర్‌లు

సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :
8328649322, 9398236146.



# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి


## కొత్త మద్యం పాలసీపై వాడీవేడీ చర్చ

### బెల్టు తీయాలన్న వేములు ప్రశాంత్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి25:** కొత్త మద్యం పాలసీ, బెల్టు షాపుల నిర్వహణపై అసెంబ్లీలో వాడీవేడి చర్చ జరిగింది. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మధ్య వాగ్వాదం చోటు- చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం పెంచుకునేందుకు లిక్కర్ రేట్లు అడ్డగోలుగా పెంచుతోందని, కొత్త మద్యం పాలసీని వెంటనే విత్ డ్రా చేసుకోవాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కొత్త ప్రభుత్వం.. కొత్త బ్రాండ్లు.. కొత్త బీర్లు, కొత్త బార్లు, కొత్త పబ్‌లు ఇదేనా ప్రభుత్వ పాలసీ అని ప్రశ్నించారు.?రాష్ట్రవ్యాప్తంగా బెల్టు షాపులు తీసేయాలని డిమాండ్ చేశారు. ఆదాయ మార్గాన్ని పెంచేందుకు బెల్టు షాపులను పెంచే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనికి శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలోనే అడ్డగోలుగా.. ఇష్టానుసారంగా మద్యం అమ్మకాలు జరిపారని ఫైర్ అయ్యారు. ఆఖరికి రేషన్షాపుల్లో కూడా లిక్కర్ సేల్స్‌కు పర్మిషన్ ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్‌కు ఉందన్నారు.


సంపుటి : 1 | సంచిక : 239 | బుధవారం 26-03-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.


# ఉగాదికి కొత్త మంత్రులు!

### పండుగ రోజు ప్రమాణ స్వీకారం!.. నలుగురు లేదా ఐదుగురికి అవకాశం


- ఎస్సీ, బీసీ, రెడ్డి, మైనారిటీ వర్గాల నుంచి
- ఒక్కొక్కరికి క్యాబినెట్ విస్తరణలో చోటు
- రాజగోపాల్‌రెడ్డికి స్థానంపై తర్జన భర్జన
- బీసీల్లో తెరపైకి మున్నూరుకాపు సామాజికవర్గం
- ఎస్సీల్లో వివేక్ వెంకటస్వామికే అవకాశం
- మైనారిటీల్లో ఎమ్మెల్సీ ఆమెర్ అలీఖాన్‌కు చాన్స్!
- ఒకట్రెండు రోజుల్లో స్పష్టత ఇవ్వనున్న అధిష్ఠానం
- నాకు చాన్స్ వస్తుందనుకుంటున్నా: రాజగోపాల్



**హైదరాబాద్, మార్చి 25:**
రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం దగ్గర పడింది. ఉగాది పండుగ రోజున.. కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విస్తరణలోనూ పూర్తిస్థాయి మంత్రిమండలి ఏర్పడే అవకాశం లేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం క్యాబినెట్‌లో ముఖ్యమంత్రి సహా 12 మంది ఉన్న విషయం తెలిసిందే. పూర్తిస్థాయి క్యాబినెట్లోకి మరో ఆరుగురిని తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే సామాజిక, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకున్న పార్టీ అధిష్ఠానం.. ఈ విస్తరణలో ఒకటి, లేదా రెండు బెర్తులను పెండింగ్‌లో పెట్టనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. క్యాబినెట్ విస్తరణలో ఎవరికి అవకాశం దక్కనుందనే విషయంపై అధిష్ఠానం ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత ఇవ్వనుంది. ఉగాది వరకు మంచి రోజులు లేవని, ఈ నేపథ్యంలో ఉగాది రోజు కొత్త మంత్రులు ప్రమాణం చేయనున్నారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఆ రోజు కుదరని పక్షంలో.. తర్వాతి రోజు ప్రమాణ స్వీకారం ఉంటుందని చెబుతున్నాయి. కాగా, మంత్రివర్గ విస్తరణలో ఓసీ(రెడ్డి), బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు ఒక్కో బెర్తును కేటాయించాలని సోమవారం ఢిల్లీలో అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జరిపిన చర్చల్లో ప్రాథమికంగా అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఎస్సీకి సంబంధించి మాల సామాజికవర్గానికి చెందిన గడ్డం వివేక్ వెంకటస్వామి పేరే దాదాపు ఖరారైనట్లు చెబుతున్నారు. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్‌సాగర్‌రావు మంత్రివర్గంలో చోటు కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వివేక్ వెంకటస్వామికి చోటు కల్పిస్తే ఎదురయ్యే పరిణామాలనూ అంచనా వేస్తున్నారు. బీసీల నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వాకిటి శ్రీహరి పేరు ఖరారైనట్లేనని ఇప్పటిదాకా ప్రచారంలో ఉంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. రాష్ట్ర క్యాబినెట్లో ముదిరాజ్ సామాజిక వర్గానికి చోటు కల్పిస్తానంటూ సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ హామీ నేపథ్యంలో.. ఆ సామాజిక వర్గానికి చెందిన ఏకైక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి క్యాబినెట్లో చోటు గ్యారెంటీ అన్న ప్రచారం జరిగింది. అయితే మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్న మున్నూరుకాపు సామాజికవర్గాన్ని దగ్గర చేసుకునేందుకు.. ఆ సామాజిక వర్గానికి చెందిన ఆది శ్రీనివాసను మంత్రివర్గంలోకి తీసుకోవాలన్న చర్చ సోమవారం నాటి సమావేశంలో జరిగినట్లు తెలుస్తోంది. అప్పుడు వాకిటి శ్రీహరికి క్యాబినెట్ హోదాతో విప్ బాధ్యతలు ఇవ్వాలన్న దానిపై చర్చించారు. ఈ రెండు అంశాలూ ప్రస్తుతం అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. ఇక ముస్లిం సామాజిక వర్గానికి సంబంధించి మంత్రివర్గంలోకి తీసుకోవడానికి ఎమ్మెల్సీ ఆమెర్ అలీఖాన్ ఒక్కరే చట్టసభల్లో అందుబాటులో ఉన్నారు. ఈ వర్గం నుంచి ఆయనకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. ఇదికాకుండా.. ముస్లింల నుంచి పార్టీ సీనియర్ నేత ఎవరినైనా క్యాబినెట్‌లోకి తీసుకుని, ఆ తర్వాత ఎమ్మెల్సీని చేసే అంశాన్నీ పరిశీలించినట్లు సమాచారం.

## విద్యారంగంపై తీవ్ర నిర్లక్ష్యం

- రిక్రూట్‌మెంట్లు పెరిగినా..డ్రాపౌట్స్ పెరగడమేమిటి
- ప్రభుత్వ తీరును నిలదీసిన బిజెపి ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి
- తమ హయాంలో విద్యావ్యవస్థను పటిష్టం చేశామన్న హరీష్ రావు



**హైదరాబాద్,మార్చి25:**
టీచర్ల రిక్రూట్‌మెంట్ జరిగినా.. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ ఔట్స్ పెరగడం ఏమిటని తెలంగాణ అసెంబ్లీలో బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తీవ్ర విమర్శలు చేశారు. బడ్జెట్ పద్దులుపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా వాడీవేడి చర్చ సాగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 26 వేల మందిని మాత్రమే రిక్రూట్ చేసిందని, ఇక కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే క్రెడిట్ తీసుకుంటుందని రాకేశ్ రెడ్డి విమర్శించారు. అంతమందిని రిక్రూట్ చేశారని చెబుతున్నారు. కానీ గతంలో ఒక్కటే కాలేజీ ఉండేది. ఇప్పుడు 100కు పెరిగాయి. కానీ ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మౌలిక సదుపాయాలు ఇంకా గణనీయంగా అభివృద్ధి చెందలేదని ఆయన అన్నారు. ఆయన తన ప్రసంగంలో విద్యా వ్యవస్థలో ఏర్పడిన లోపాలను ఎత్తిచూపారు. పదేళ్లలో 6,000 ప్రభుత్వ స్కూళ్లు మూతపడ్డాయని, గత ఏడాది లోపలే 1,800 స్కూళ్లు మూతపడిన విషయం గమనార్హమని చెప్పారు. అప్పుడు బంగారు తెలంగాణ అని చెప్పారు, ఇప్పుడు వజ్రాల తెలంగాణ అంటున్నారు. కానీ విద్యా రంగం మాత్రం దిగజారిపోతోంది. 1931 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేకుండా ఉన్నాయి. ఇన్ని వేల కోట్ల బడ్జెట్ పెట్టినా పరిస్థితి మారడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్కూళ్లపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారు. స్కూళ్లలో ఒకటే బాత్రూం ఉంటుంది, అక్కడ పందులు తిరుగుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలు ఎలా ప్రభుత్వ స్కూళ్లలో చదవగలరని అన్నారు. తల్లిదండ్రులు అప్పు చేసి ప్రైవేట్ స్కూళ్లకు పంపించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో ఆలోచించాలని పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. విద్యాశాఖ సీఎం వద్ద ఉంది. కానీ సీఎం దగ్గర చాలా పనులు ఉంటాయి. కాబట్టి ఈ శాఖను మరొకరికి అప్పగిస్తే మంచిది. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని మెరుగుపరిచే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. లేకపోతే డ్రాప్ ఔట్స్ సంఖ్య ఇంకా పెరుగుతుందని ఎమ్మెల్యే సూచించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి సీనియర్ సభ్యుల సూచనలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రి-టైర్డ్ ఆఫీసర్ల సహాయంతో పాఠశాలల నిర్వహణను మెరుగుపర్చాలన్నారు రాకేశ్ రెడ్డి. స్కూళ్లకు కాంపౌండ్ వాల్, శుభ్రమైన వసతులు కల్పించాలని, బడ్జెట్ కేటాయింపులను స్పష్టంగా ప్రజలకు తెలియజేయాల న్నారు. ఇకపోతే ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలకు అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు.

## తెలంగాణ క్యాబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్

### మంత్రి పదవిపై పలువురి ఆశావహుల ఆశలు

**హైదరాబాద్,మార్చి25:** ఎప్పుడెప్పుడా అని ఆశావహులు ఎదురుచూస్తోన్న తెలంగాణ కేబినెట్ విస్తరణకు ముహూర్తం దగ్గరపడింది. ఉగాది కానుకగా తెలంగాణ మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాలుగు మంత్రి పదవులు, డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్ పదవుల భర్తీకి ఆమోద ముద్ర పడింది. అయితే కేబినెట్‌లో రెండు బెర్త్‌లను పెండింగ్‌లో పెట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో తెలంగాణ సీఎం, కాంగ్రెస్ కీలక నేతలతో ఢిల్లీలో సోమవారం సుదీర్ఘ సమావేశం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. అధిష్టానంతో భేటీ అయ్యారు. తెలంగాణలో ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరిం చారు. పార్టీ బలోపేతంపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. అన్ని విషయాలతో పాటు కేబినెట్ విస్తరణపై కూడా చర్చ జరిగిందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మార్పు నినాదంతో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టి ఏడాదిన్నరయింది. అదిగో ఇదిగో అంటూ కేబినెట్ విస్తరణ ఆశవహులను ఊరిస్తూనే ఉంది. ప్రస్తుతం సీఎం సహా 12 మంత్రులు వున్నారు. లెక్క ప్రకారం కేబినెట్‌లో మరో ఆరుగురికి చోటు వుంటుంది. రెండు పెండింగ్‌లో పెట్టాలనే నిర్ణయం జరిగినట్టు చర్చజరుగుతోంది.

## ఘటకేశ్వర్ రైల్వే బ్రిడ్డికి తొలగిన అడ్డంకులు

### 50లక్షలు మంజూరు చేసిన భట్టి



**హైదరాబాద్,మార్చి25:**
మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చొరవతో ఘట్‌కేసర్ రైల్వే బ్రిడ్జి పనులకు నిధులు మంజూరయ్యాయి. అర్ధాంతరంగా పనులు నిలిచిపోయి పెండింగ్‌లో ఉన్న ఘట్‌కేసర్ రైల్వే బ్రిడ్జి పనుల నిమిత్తం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ.50లక్షలను మంజూరు చేశారు. దీనిపట్ల ఘట్‌కేసర్ జేఏసీ, మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే బ్రిడ్జి పనులను పూర్తి చేసేందుకు సహకరించాలని ఘట్‌కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మాజీ మంత్రి మల్లారెడ్డినికి కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో డిప్యూటీ- సీఎం భట్టివిక్రమార్కను మల్లారెడ్డి కలిసి సమస్యను వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన భట్టి విక్రమార్క.. రూ.50 లక్షలను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నిధులు మంజూరు చేయడం పట్ల భట్టి విక్రమార్క, మల్లారెడ్డికి ఘట్‌కేసర్ జేఏసీ చైర్మన్ మారం లక్ష్మారెడ్డి, సభ్యులు, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్ గౌడ్, పలువురు కౌన్సిలర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బండారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి మల్లారెడ్డి చొరవతోనే బ్రిడ్జ్ నిర్మాణం 80 శాతం పూర్తయిందని తెలిపారు.

## మొత్తం 35 సవరణలకు అనుమతి

### లోక్‌సభలో ఫైనాన్స్ బిల్లుకు ఆమోదం



**న్యూఢిల్లీ,మార్చి25:** ఆన్ లైన్ ప్రకటనలపై 6 శాతం డిజిటల్ పన్నును రద్దు చేయడంతో పాటు 35 ప్రభుత్వ సవరణలతో ఫైనాన్స్ బిల్లు 2025ను లోక్ సభ ఆమోదించింది. దీంతో బడ్జెట్ ఆమోదం పక్రియ లోక్‌సభలో పూర్తయింది. ఇక రాజ్యసభలో ఫైనాన్స్ బిల్లు పై చర్చ జరగనున్నది. రాజ్యసభ కూడా ఆమోదిస్తే 2025-26 బడ్జెట్ ఆమోదం పక్రియ పూర్తయినట్లే.. 2025 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికి కేంద్రం స్పాన్సర్ చేస్తున్న పథకాలకు రూ 5,31,850.21 కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ కేటాయింపు రూ. 4,15,356.25 కోట్లు-మాత్రమే. కేంద్ర ప్రభుత్వ రంగ పథకాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 16.29 లక్షల కోట్లు- కేటాయించారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల వాటా, గ్రాంట్లు-, రుణాలు, కేంద్రం ప్రాయోజిత పథకాల కింద విడుదల చేసే మొత్తంతో సహా రాష్ట్రాలకు బదిలీ అయ్యే నిధులు రూ. 25,01,284 కోట్లు-. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు- 4.4శాతంగా అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు- 4.8 శాతంగా అంచనావేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి) రూ. 3,56,97,923 కోట్లు-గా అంచనా వేశారు. జాతీయ గణాంక సంస్థ విడుదల చేసిన ఈ ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం జిడీపీ రూ. 3,24,11,406 కోట్లు-. అంటే కొత్త ఆర్థిక సంవత్సరంలో జిడిపీ 10.1 శాతం ఎక్కువగా ఉంటుందని అంచనా.

## హోంశాఖ నా ఫేవరేట్: కోమటిరెడ్డి

**హైదరాబాద్,మార్చి25:** మంత్రి పదవి వస్తదనే అనుకుంటున్నా... కెపాసిటీని బట్టి మంత్రులను ఎంపిక చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. తాజాగా మీడియా చిట్‌చాట్‌లో ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. భువనగిరి ఎంపీ బాధ్యతలు ఇస్తే.. సమర్థవంతంగా నిర్వహించానని గుర్తు చేశారు. తనకు హోంమంత్రి పదవి అంటే ఇష్టమన్నారు. ఏ పదవి వచ్చినా సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడతానని స్పష్టం చేశారు.

## జమిలి ఎన్నికల జెపిసి గడువు పొడిగింపు

### లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఆమోదం

**న్యూఢిల్లీ,మార్చి25:** 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'పై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని 2025 వర్షాకాల సమావేశాల చివరి వారం మొదటి రోజు వరకు పొడిగించే ప్రతిపాదనను లోక్‌సభ మంగళవారం ఆమోదించింది. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' బిల్లు 2024 , కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు- 2024 పై లోక్‌సభలో నివేదిక సమర్పించడానికి సమయాన్ని పొడిగించాలని జాయింట్ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పిపి చౌదరి మంగళవారం ప్రతిపాదించారు. దీనిని సభ మూజువాణి ఓటు- ద్వారా ఆమోదించింది. దేశవ్యాప్తంగా ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై మోడీ ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బీజేపీ ఎంపీ, మాజీ న్యాయశాఖ మంత్రి పిపి చౌదరి అధ్యక్షతన 39 మంది సభ్యుల జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు- చేశారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఖర్చుచ, సమయం ఆదా అవుతాయని ప్రభుత్వం చెబుతోంది. అయితే ప్రతిపక్షాలు మాత్రం అంగీకరించడం లేదు. తాజాగా జెపిసి చైర్మన్, భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఎంపి పిపి చౌదరి గడువు హెచ్చింపు కోసం తీర్మానాన్ని లోక్‌సభలో ప్రతిపాదించారు. సభ మూజువాణి వోటుతో తీర్మానానికి ఆమోదం తెలిపింది. రాజ్యసభ నుంచి ఒక కొత్త సభ్యుని కమిటీ-లో చేరుస్తున్నట్లు- లోక్‌సభ సెక్రటరీ జనరల్ సభకు తెలియజేశారు.

## బీసీ గురుకులలో బ్యాగ్ లాగ్ సీట్లకు ధరఖాస్తు



**తోవ్వ,చేవెళ్ల, మొహీనాబాద్, మార్చి 25,**

మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల,రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా బీసీ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న 6,7,8,9వ తరగతుల సీట్లను చేయడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని,ఎంజేపీ గురుకుల పాఠశాల,ఎఫ్.ఏ.సీ ప్రిన్సిపాల్ జంగం నరేష్, ఒక ప్రకటనలో తెలిపారు. WWW. mjpbcwres. telangana.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు, చేసుకోవాలని ప్రిన్సిపాల్ జంగం నరేష్ సూచించారు. 6,7,8,9వ తరగతుల, ఇంగ్లీష్ మీడియంలో మొత్తం 6,832 బ్యాగ్ లాక్ ఉన్నాయని అర్హులైన విద్యార్థులు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష 20-04-2025 ( ఆదివారం ) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏటిపి లింగ స్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్నచోట వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలి



**యాదాద్రి జిల్లా: వలిగొండ :తొవ్వ ప్రతినిధి: మార్చి 25**

సిర్పంగి స్వామి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి

ఉమ్మడి గ్రామాలు ఉండి నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీల్లో వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం రోజున మండల పరిధిలోని దాసిరెడ్డిగూడెం గ్రామంలో ఉపాధి హామీ పనుల వద్ద కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గ్రామపంచాయతీలు గతంలో ఉన్న గ్రామాలు నూతనంగా గ్రామ పంచాయతీలుగా ఏర్పడినప్పటికీ ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించడం లేదని, వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని, ఉపాధి హామీ పనులను వేగవంతం చేసి కూలీలందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేసారు. పని ప్రదేశంలో నీడకు టెంట్,మరియు మంచినీటిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి కొమ్ము స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బొడిగె యాదయ్య, కూలీలు రాపోలు సునీత గోద నాగమణి శ్యామల సాలమ్మ దాసరి చంద్రకళ, కోనపురి కలమ్మ, రాపోలు పోశయ్య, సప్పిడి నాగమ్మ ,నారి పద్మ, రాపోలు మల్లయ్య, రాపోలు శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పునాది నుండే సంస్కృతి నేర్పాలి

**విద్యార్థులు అంటే బానిసలు కాదు భావితరాలకు బాటలు**



**తొవ్వ, కేసముద్రం, మార్చి 25**

:కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ చిల్డ్రన్స్ ఉమెన్స్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్ ఫౌండర్ చైర్మన్ ఎండి మొహనుద్దిన్ ఆదేశాల మేరకు యు పి ఎస్ అమీనాపురం ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థిని విద్యార్థులకు పోషక ఆహారం, శుభ్రత పరిశుభ్రత, అవగాహనతోపాటు విద్యార్థిని విద్యార్థులకు నోట్ బుక్, పెన్ను, పెన్సిల్, రేజర్,రబ్బర్ ఎన్ హెచ్ ఆర్ సి అండ్ డబ్ల్యు ఈ వో కేసముద్రం మండల ప్రెసిడెంట్ సోమారపు శ్రీరాములు, జన్ను శ్రీనివాస్, కాసు సతీష్ టీం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టేట్ ప్రెసిడెంట్ సెక్రటరీ కుమ్మరి సంపత్, విలాసారం త్రివిక్రమ్ కోశాధికారి,స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బెల్లంకొండ శ్రీనివాసరావు, మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ కొండపాక దేవి హాజరయ్యారు. బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ యువత విద్యార్థి దశ నుండే చదువుతోపాటు ఆటలు, శిక్షణా, క్రమశిక్షణ అవలంబిస్తూ ఉపాధ్యాయులు నేర్పినటువంటి పాఠాలను శ్రద్ధతో నేర్చుకుంటూ సమాజంలో జరుగుతున్నటువంటి చెడును దూరం చేసే విధంగా, దేశ అభివృద్ధి కోసం తల్లిదండ్రులు పిల్లలపై కన్నటువంటి కలలను నిజం చేసే విధంగా చదువులు సాధించి గొప్ప స్థానంలో నిలబడి చూపించాలని అన్నారు.విద్యార్థినీ విద్యార్థులకు శుభ్రత పరిశుభ్రత పై అవగాహన తిమ్మంపేట ఎం ఎల్ హెచ్ పి డాక్టర్ ప్రత్యూష వివరించారు.ముఖ్యఅతిథిగా విచ్చేసిన వారికి కేసముద్రం మండల ఎన్ హెచ్ ఆర్ సి అండ్ డబ్ల్యు ఈ ఓ సోమరపు శ్రీరాములు వారికి శాలువాలతో సత్కరించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు రాష్ట్ర,జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు భోజనాలు అందించినారు. ఇట్టి కార్యక్రమంలో అమీనాపురం యుపిఎస్ ప్రధాన ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, హన్మకొండ జిల్లా ప్రెసిడెంట్ వి. గోవర్దన్.రాజేష్,జాయింట్ సెక్రటరీ దొమ్మటి రవీందర్, మహిళా విభాగం దేవి నుండీ కొడపాక దేవి, మెరి,అమరావతి,సరిత, అంజనీ దేవి,హెల్త్ డిపార్ట్మెంట్ ఏఎన్ఎం యాకమ్మ,ఆశ మహేశ్వరి,ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థినిలు పాల్గొన్నారు.

## పాలడుగు ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ నీటి దినోత్సవం




**యాదాద్రి జిల్లా: వలిగొండ: తొవ్వ ప్రతినిధి: మార్చి25**

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల లోని పాలడుగు ప్రభుత్వ ఎంపీ యుపిఎస్ పాఠశాలలో మంగళవారం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాజెక్టు ఆఫీసర్ కొండూరు సత్తయ్య ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 22, 1993 నుండి ఐక్యరాజ్యసమితి ఆదేశానుసారం ప్రపంచ నీటి దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. హిమని నదాల సంరక్షించడానికి నీటిని పొదుపుగా వాడుకోవడం, నీటిని వృధా చేయొద్దని, నీటిని కాలుష్యం చేయకూడదని అన్నారు. ప్రతి సంవత్సరం 2.2 బిలియన్ల మందికి హిమాలయాలు కరిగి నదుల ద్వారా నీరు వస్తుందని అన్నారు. హిమనీ నదాలు కరిగిపోవడం వల్ల నీటి కొరత వరదలు, కొండ చర్యలు విరిగిపడడం మరియు సముద్రమట్టాలు పెరగడం బులియన్ల మంది ప్రజలు మరియు పర్యావరణ వ్యవస్థలకు ముప్పు వాటిల్లుతుందని అన్నారు. వాతావరణ మార్పుల కారణంగా హిమనీనదాలు వేగంగా కరుతున్నాయని ప్రపంచ నీటి చక్రాలకు అంతరాయం కలిగిస్తున్నాయని అన్నారు. భవిష్యత్తులో నీటి వనరులను భద్రపరచడానికి ఉద్గారాలను తగ్గించడం మరియు స్థిరమైన నీటి నిర్వహణ చాలా ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై కమలాకర్ రెడ్డి,ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే

# కఠిన చర్యలు తీసుకుంటాం

**జిల్లా సివిల్ సప్లై అధికారులు - అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం**

**పట్టుకున్న జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు,**



**తొవ్వ, నెల్లికుదురు, మార్చి 26**

ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్ తెలిపారుమంగళవారం నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరి రైస్ మిల్ లో పిడిఎస్ రేషన్ బియ్యం సుమారు 430, క్వింటాళ్లు అక్రమంగా తరలిస్తుండగా జిల్లా సివిల్ సప్లై అధికారులు ప్రేమ్ కుమార్, సంబంధిత సిబ్బందితో కలిసి పట్టుకున్నారు, లబ్ధిదారుల నుండి అక్రమంగా కొనుగోలు చేసి వాటిని క్లీనింగ్ పాలిష్ చేసి వరంగల్ లోని సాయి లక్ష్మి రైస్ మిల్లు ద్వారా అమ్మకాలు జరుపుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు,జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరిగితే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని,క్షేత్రస్థాయిలో నిఘా పెంచి ప్రతి మిల్లులను తనిఖీ చేయడం జరుగుతుందని అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు., రాజరాజేశ్వరి రైస్ మిల్లు మేనేజర్ పై శాఖా పరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేయడం జరుగుతుందనన్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ తాసిల్దార్ సత్యనారాయణ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో ఏక్ భారత్. శ్రేష్ఠ భారత్ కార్యక్రమం




**తొవ్వ, నెల్లికుదురు, మార్చి 25**

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు మాట్లాడుతూ మన దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల మధ్య స్థిరమైన, నిర్మాణాత్మకమైన ఆచారసాంప్రదాయ సాంస్కృతిక సంబంధాల అవగాహన కలిగించుటకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన కార్యక్రమమే ఈ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్. కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగానే. ఆదర్శ పాఠశాలలోవిద్యార్థినీ విద్యార్థులకు హర్యానా రాష్ట్ర ఆచార వ్యవహారాలను సంస్కృతిని పరిచయం చేసి వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించామన్నారు కాగా. హర్యానా రాష్ట్ర సంస్కృతిని తెలిపే సాంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు బహుమతులు ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు నభీ, అంజుం సుల్తానా, సతీష్,నాగమోహన్ రావు, యుగంధర్, లక్ష్మణ్, కవిత, షెహ్నాజ్ , యాకాంబ్రం, కొమురయ్యల తో పాటు విద్యార్థులను అభినంధించారు.

## న్యాయవాదులు ఇజ్రాయిల్ హత్య,గడ్డం యాదగిరి లకు సంతాపంగా విధులు బహిష్కరించిన న్యాయవాదులు




**యాదాద్రి జిల్లా:రామన్నపేట: తొవ్వ ప్రతినిధి:మార్చి 25**

అతి కిరాతకంగా దుండగుల చే హత్యగావించబడిన ఇజ్రాయిల్ హత్యను నిరసిస్తూ, గడ్డం యాదగిరి రామన్నపేట బార్ అసోసియేషన్ సభ్యులు గుండెపోటుతో మరణించడం జరిగింది. వీరిద్దరి ఈ సంతాప సూచికంగా మంగళవారం రామన్నపేట కోర్టు లో విధులు బహిష్కరించి సంతాపాన్ని నిరసనను వ్యక్తం చేయడం జరిగింది అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి మజీద్ మాట్లాడుతూ హత్యలు దాడులతో సమస్య పరిష్కారం కాదని చట్టాల ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు యాదగిరి, స్వామి, యాపాలకృష్ణారెడ్డి, కంపాటి యాదగిరి, జింకల ప్రభాకర్, ఉయ్యాల హనుమంతు గౌడ్, డేవిడ్ పాల్వంచ జగతయ్య నకిరేకంటి మొగులయ్య, మామిడి వెంకట్ రెడ్డి. యాదాసు యాదయ్య ,సత్తయ్య, ఎల్ల శ్రీశైలం ,సంగిశెట్టి బాలరాజు, నోముల స్వామి, దినేష్ , కునూరు శ్రీనివాస్, జినుకల సాయి, రమేష్ ,తదితరులు పాల్గొన్నారు.

## యువత ఆన్ లైన్ బెట్టింగ్‌కు బానిస కావొద్దు

**కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజిరెడ్డి**



**యాదాద్రి జిల్లా:రామన్నపేట: తొవ్వ ప్రతినిధి :మార్చి 25**

రామన్నపేట మండల యువత,విద్యార్థులు ఆన్ లైన్ అక్రమ క్రికెట్ బెట్టింగ్ యాప్ లకు అలవాటు పడి అప్పుల పాలై జీవితాలు నాశనం చేసుకొని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట్ రాజి రెడ్డి అన్నారు.అక్రమ బెట్టింగ్ యాప్లలో బెట్టింగ్ కు పాల్పడి ఆన్లైన్ గేమ్స్ ఆడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చు అన్న భ్రమలో యువత విద్యార్థులు బెట్టింగ్ యాప్స్ కి బానిసలుగా మారి అప్పులపాలై ప్రాణాల మీదకు తెచ్చుకొని విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. సోషల్ మీడియాలో వీటిని ప్రోత్సహించడం వల్ల యువతలో దీని వ్యసనం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై నిఘా పెట్టి తప్పుడు మార్గంలో పయనించకుండా జాగ్రత్త వహించాలని కోరారు.తల్లిదండ్రులు పిల్లలపై కోటి ఆశలతో రెక్కలు ముక్కలు చేసుకుని ఉన్నతమైన విద్యలు చదివించి ఉద్యోగాలలో స్థిరపడతారని ఆశతో ఉన్నారని అలాంటి గొప్ప తల్లిదండ్రుల ఆశలు నిరాశలు చేయవద్దని తెలిపారు.యువత పెడదారిని వదిలి సన్మార్గంలో నడిచి తల్లిదండ్రుల,పెద్దల గురువుల మాటలు విని ప్రయోజకులుగా ఎదగాలన్నారు. పిల్లలు ఉన్నత శిఖరాలలో కూర్చున్నప్పుడే తల్లిదండ్రులతో పాటు సమాజం కూడా మనల్ని గౌరవిస్తుందని తెలిపారు.

## మూడో రోజుకు చేరుకున్న ప్రజా చైతన్య పాదయాత్ర

**గ్రామాల్లో పలు సమస్యలపై అధ్యయనం**



**యాదాద్రి జిల్లా :రామన్నపేట: తోవ్వ ప్రతినిధి: మార్చి 25**

రామన్నపేట మండలంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న తుర్కపల్లి,సూరారం, బాచుప్పల గ్రామాల్లో అపరిస్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జిల్లాల పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల సమగ్రాభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్ర మంగళవారం మూడో రోజుకు చేరుతుంది. తుర్కపల్లి సూరారం బాచుప్పల పల్లివాడ మునిపంపుల గ్రామాల్లో యాత్ర బృందం పర్యటించి ప్రజల్ని సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాదయాత్ర బృందం సారధి జల్లెల పెంటయ్య మాట్లాడుతూ మండల కేంద్రానికి దూరంగా ఉండబడిన గ్రామాలైన తుర్కపల్లి సూరారం బాచుప్పల గ్రామాల్లో సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయని. పాఠశాలల్లో టీచర్లు ఇతర ప్రభుత్వ సిబ్బంది రవాణా సౌకర్యం లేక రావడానికి ఇబ్బంది పడుతున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రయాణాలు నరక కోపంగా మారుతున్నాయి. బస్సులు రాక విద్యార్థులు మండల కేంద్రానికి వచ్చి చదువుకోలేక విద్యను మధ్యలోనే మానేస్తున్నారు. తుర్కపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణ దశలోనే ఆగిపోయింది. సూరారం గ్రామంలో పశువుల దావకాన నిర్మించి సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికీ పూర్తి కావడం లేదు. మూసి కాల్వ ఇండ్ల సమీపంలో ఉండడంతో అధిక వర్షాలు వచ్చినప్పుడు నీరు ఇండ్లలోకి రావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అమ్మనబోలు నుండి సూరారం రహదారిలో కల్వర్టు లేక అధిక వర్షాలు వచ్చినప్పుడు రోడ్డు దాటలేకపోతున్నారు. ఉప్పు చెరువు దగ్గర రోడ్డుకు ఉన్న భద్రత కూడా కూలి ప్రమాదంగా తలపిస్తున్నది. గ్రామాల ప్రత్యేక అధికారులు కనీసం గ్రామ వైపు చూసే పరిస్థితి లేదు సమస్యలపై కేంద్రీకరించేవారు లేరు. ఉపాధి కూలీకి పోతే ?100 కూడా పడడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పాదయాత్ర బృందం సభ్యులు, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, బోయిని ఆనంద్, కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు, గన్నేబోయిన విజయభాస్కర్,వేముల సైదులు,బోడిగే రజిత, గొరిగే సోములు, మేడి గణేష్,కొమ్ము అంజమ్మ, శానగొండ రాము,పాదయాత్ర సమన్వయకర్తలు వనం ఉపేందర్,బల్గురి అంజయ్య, కల్లూరి నగేష్,తొలుపునూరి శ్రీనివాస్, అవగంటి రవీందర్ ,మెట్టు శ్రవణ్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటపాక శివకుమార్ ఈర్లపల్లి ముత్యాలు,గాదె నరేందర్, మునికుంట్ల లెనిన్, పుట్టల ఉదయ్ కుమార్, ఇతరులు పాల్గొన్నారు.

## అకాల వర్షం అపరాలు,మామిడి రైతులకు నష్టం

**-నెలవాలిన మొక్కజొన్న పరిశీలించిన ఏఓ రాంజీ**



**తోవ్వ, బయ్యారం,మార్చ్ 25.**

బయ్యారం మండలంలో అకాల వడగళ్ల వాన ఉమ్మడి కంబాలపల్లి, కొత్తపేట ,ఇర్సులాపురం గ్రామ పంచాయితీలు పరిధిలో గాలి వాన దుమారంతో,వడగళ్ల వాన కురియడంతో మామిడి తోటల్లో పూత,పిందదశలో ఉన్న కాత నేలవారింది,మండలంలో సోమవారం, మంగళవారం రెండు రోజులు అకాల వర్షం పడింది.మండలంలో విస్తారంగా మొక్కజొన్న, అపరాలు పండించిన రైతులకు ఈ వడగండ్ల వానతో నష్టం వాటిల్లినట్టు ఆయా ప్రాంతాల రైతులు తెలిపారు.రానున్న రెండు రోజులలో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలితో కూడిన వడగళ్ల వాన పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది.సోమవారం కురిసిన వానకు మండలంలో మొక్కజొన్న తాత్కాలికంగా నెలవారిందని అది కోసే దశలో ఉండటం వల్ల పెద్దగా నష్టం వాటిల్లలేదని పర్యవేక్షించిన మండల వ్యవసాయ అధికారి రాంజీ ఒక ప్రకటనలో తెలిపారు.అపరాలు సాగు చేసే రైతులు,కోత అయిన మొక్కజొన్న పంటలను రైతులు టార్పలిన్ ద్వారా పంటను భద్రపరుచుకోవాలని సూచించారు.బీరోని మడవ గ్రామంలో సోమవారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటను మండల వ్యవసాయ అధికారి బానోతు రాంజీ వ్యవసాయ విస్తరణ అధికారి శిరీష పరిశీలించారు.పంట నష్టపోయిన రైతులను అడిగి గుగులోతు వీరన్న గుగులోతు రాంబాబు,గుగులోతు గణేష్ మొక్కజొన్న పొలాలను పరిశీలించారు,ఇతర రైతుల నష్టం వాటిల్లిన పంటల నష్టం ఆధారంగా ప్రాథమిక రిపోర్ట్ తయారుచేసి ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని అన్నారు.

## సాంబశివుడు 14వ వర్ధంతి

**యాదాద్రి జిల్లా: వలిగొండ: తోవ్వ ప్రతినిధి: మార్చి 25**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని దాసిరెడ్డిగూడెంలో కూనపురి సాంబశివుడు 14వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఉదయం 9 గంటలకు కూనపురి సాంబశివుడి స్థూపం వద్ద నివాళులర్పించడం జరుగుతుందని కూనపురి కుటుంబ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ ఎస్ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ షీప్ అండ్ గోట్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ పాల్గొంటున్నారని బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు సాంబశివుడు అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించాలని కుటుంబ సభ్యులు కోరారు.

## ఎమ్మెల్యే ప్రస్తావన..పాలకుర్తి బస్టాండ్ పనుల కు మోక్షం

**రవాణా శాఖ మంత్రి “పొన్నం “ బస్టాండ్ అభివృద్ధికి ఉత్తర్వులు**

**పాలకుర్తి మండల ప్రజలు ఎమ్మెల్యే కు కృతతలు**



**తొవ్వ ,పాలకుర్తి ,మార్చ్ 25:**

ఎన్నో ఏండ్లుగా అభివృద్ధికి నోచుకోని పాలకుర్తి బస్ స్టాండ్ ఎట్టకేలకు మోక్షం లభిస్తుంది పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి చొరవతో అసెంబ్లీ లో బస్సు స్టాండ్ పై ప్రస్తావన చేయగా రవాణా శాఖ మంత్రి అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీ ఇవ్వడమే తరువాయిగా వెంటనే అయన కార్యాలయం వెళ్లి అభివృద్ధి నిధులు మంజూరు చేయించుకొని పనుల కోసం ఉత్తర్వులు సాదించారు . ఇటు కాంగ్రెస్ నాయకులు అటు మండల ప్రజలు హర్షతి రేకలు వెలిబుచ్చి కల నెరవేరిందని సంబరాలు చేసుకుంటున్నారు

# ముస్తాబైన కొండలమ్మ దేవాలయం

**-కాకతీయులు నిర్మించిన ఆలయాన్ని కాపాడండి**

**-దేవాదాయ శాఖ సహకరించి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి**

**-పిన్నిరెడ్డి గూడెం గ్రామస్తులు లక్ష్మారెడ్డి**



**తొవ్వ,గార్ల మార్చి25**

ఉగాది పర్వదినాన ప్రతీ ఏటా పిన్నిరెడ్డి గూడెంలో నిర్వహించే కొండలమ్మ జాతరకు సర్వం సిద్ధం చేసినట్టు బీరవెల్లి లక్ష్మారెడ్డి తెలిపారు. కాకతీయుల కాలంలో అలనాడు 12వ శతాబ్దంలో ప్రతాపరుద్రుడు నిర్మించిన కొండలమ్మ దేవాలయం చాలా ప్రసిద్ధిగాంచి నిత్య పూజలు అందుకుంటుందని అయన అన్నారు. ఆనాడు ప్రతాపరుద్రుడు కొండమ్మ, గారమ్మ, బయ్యమ్మలుగా దేవతలను కొలిచేవారని వారి పేర్లతో పిన్నిరెడ్డి గూడెంలో చెరువుకు కొండలమ్మ చెరువు అని ,సీతంపేట గ్రామంలోని పెద్ద చెరువుకు గార్ల చెరువు అని, బయ్యారం చెరువుగా పేర్లు పెట్టుకుని గంగదేవిని కొలిచేవారని దానినే ఆచారంగా ఆయా చెరువుల చుట్టూ ప్రక్కల ఉన్న రైతులందరూ ప్రతి ఏటా పండే పంటలో కొంత పంటతో ఆ దేవతలకు పరమాన్నం ప్రసాదించేవారని, అలాగే ప్రతీ ఏటా ఉగాది పర్వదినాన మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పిన్నిరెడ్డి గూడెం గ్రామంలో నాలుగు రోజులపాటు ప్రత్యేక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. పిన్నిరెడ్డి గూడెం గ్రామస్థులే కాక ఉమ్మడి జిల్లాల ప్రజలు,విదేశాల్లో స్థిరపడిన వారు కూడా కొండలమ్మ దీవెనలు అందుకునేందుకు తండోపతండాలుగా తరలి వస్తు ముమ్మరంగా జాతరలో పాల్గొంటున్నారన్నారు. ఐతే 12వ శతాబ్దంలో నిర్మించిన కొండలమ్మ దేవాలయం శిథిలావస్థకు చేరి రోజు రోజుకూ ఒక్కో రాయిగా అంతరిస్తూ ఆలయ రూపురేఖలు మారుతూ అంతరించి పోతుంటే గత 50ఏళ్లుగా గ్రామస్తులు కాపాడుతూ తలో ఇంత అన్న కోణంలో అభివృద్ధి చేస్తూ గుడిని కాపాడుతున్నట్టు గ్రామస్థులు తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లి కొండలమ్మ అని వారి నమ్మకం. ఆ ఊరిలో ఇంటికొకరికైనా కొండలమ్మ పేరుతో కలిసివచ్చేలా కొండల్, కొండలయ్య, కొండలమ్మా అని పేర్లు కూడా పెట్టుకుంటారని అన్నారు. పాడి పంటలు, పిల్లలు లేనివారికి సంతానం, ఆరోగ్య సమస్యలపై ఏది కోరునా తల్లి దివేనాలతో తప్పక కోరికలు నెరవేరుతాయని వారి నమ్మకం. ప్రతీ ఏటా అక్కడి ఆలయానికి రెండు నాగు పాములు వచ్చి ఆ నాలుగు రోజులపాటు అక్కడి ఆలయంలో దర్శనమిస్తూ వచ్చిన భక్తులను దివిస్తాయని మరుసటి రోజున ఆ నాగులు మాయమై మళ్ళీ మరుసటి సంవత్సరం దర్శనమిస్తాయని వారు తెలిపారు. ఐతే ప్రతి ఏటా జరిగిన విధంగా జాతర జరుపుతూ ఆలయాన్ని కాపాడుతుంటే ప్రతి ఏడాది 4రోజులు జరిగే జాతరకు 50వేలకు పైగా భక్తుల ఆదరణ ఉన్న ఆలయాన్ని దర్శించుకుంటున్న అమ్మవారి దేవాలయాన్ని దేవాదాయ శాఖ, ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై గ్రామ పెద్దలు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ప్రతి ఏటా ఆ సమయంలో ప్రభుత్వాన్ని పరిపాలించే ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, జిల్లా రాష్ట్ర స్థాయి అధికారులు అమ్మవారి దీవెనలు తీసుకుంటున్నారే తప్ప దేవాలయ అభివృద్ధి గురించి ఆలోచించలేదని అన్నారు. ఏటా ఏటా భక్తులు పెరుగుతున్న విషయాన్ని పరిగణలోకి తీసుకునైనా ఆలయ అభివృద్ధి పై ఆలోచన జరపాలని కోరుతున్నారు. ఈ నెల28 ఎడ్ల బండ్ల ప్రభాలల ఊరేగింపు, 29న పూర్ణకుంభంతో దేవతారాధన, 30న నైవేద్యాల సమర్పణ, మహాజాతర, 31న సంకృతిక కార్యక్రమాలు భజన కార్యక్రమలను భక్తులంతా అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటి సభ్యులు కోరారు. వారిలో ఆలయ కమిటీ చైర్మన్ బుర్లమల్లేషం, పుణెం వెంకన్న,పెంట్యాల శ్రీనివాసరావు, పి ఎల్లయ్య,పి రమణ,జలగం కొండయ్య, కె కొండల్ రావు,చింత ఎల్లయ్య,మోతీలాల్, ఎ రాజేష్,నరసింహ,నారాయణ రెడ్డి,అప్పి రెడ్డి,కమిటీ సభ్యులు తదితరులున్నారు.

# కష్టపడ్డ యువతను కాపాడుకుంటాం

**పార్టీలో సముచితమైన స్థానం కల్పిస్తాం**

**పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి**



**తొవ్వ , పాలకుర్తి , మార్చ్ 25:**

కష్టపడ్డ యువతను కాపాడుకుంటు .. పార్టీలో సముచితమైన స్థానం కల్పిస్తామని .పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు . మంగళవారం పెద్దవంగర మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో, పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి కార్యకర్తలు యూత్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెద్దవంగర మండలానికి చెందిన వివిధ గ్రామాల యువజన అధ్యక్షులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు..ఈ సందర్భంగా గ్రామ స్థాయిలో పార్టీ కార్యకలాపాలు, యువతలో రాజకీయ చైతన్యం పెంపు, సోషల్ మీడియా వేదికగా పార్టీ అభిప్రాయాలను ప్రజల్లోకి చొప్పించడంపై విశ్లేషణ గా చెప్పారు . గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయడం కోసం యువజన నాయకులు ప్రతి స్థాయిలో చురుకుగా పనిచేయాలి. ప్రతి గ్రామంలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సోషల్ మీడియా కోఆర్డినేటర్లపై ఉంటుంది.

# ఏజన్సీలో “బోరింగ్ “ బొరియలు

**వందల ఫీట్లు అనుమతి లేకుండా బోరింగ్ బొక్కలు**

**కొత్తగూడ ,గంగారాం ప్రాంతాల్లో ఎక్కడ చూసిన బోరింగ్ మిషన్లే .**

**షెడ్యూల్ ప్రాంతాల చట్టాలకు అధికారులు తూట్లు**

**లంచాల్లో రెవిన్యూ ,అటవీశాఖ అధికారులంటూ ఆరోపణలు**



**తొవ్వ ,మహబూబాబాద్,మార్ఛ్ 29**

షెడ్యూల్ ప్రాంతాల్లో గడ్డపారా పెట్టి బొక్క పెట్టాలన్న అటు ఫారెస్ట్ ఇటు రెవిన్యూ అధికారులు ఫాలో మంటూ వచ్చి నానా యాగీ చేసి కేసులు పెట్టి జైళ్లకు పంపిస్తారు కానీ మహబూబుబాబాద్ జిల్లాలో షెడ్యూల్ ఏరియా అయిన గంగారాం , కొత్తగూడ ప్రాంతాల్లో వందల ఫీట్లు బోరింగ్ బొక్కలు పెడుతున్న అటు ఫారెస్ట్ ఇటు రెవిన్యూ అధికారులకు కనీసం కండ్లకు కూడా కనిపించడం లేదనధీ వాస్తవం జిల్లా లో ఈ వేసవి ప్రారంభం అయినప్పటి నుంచి తమిళనాడు ఇతర ప్రాంతాల నుంచి బోరింగ్ మిషన్ లను ఫీట్ కు 60 రూపాయలనుంచ్చి మాట్లాడుకొని బోరింగ్ వేసేవారు వద్ద నుంచి 80 నుండి 120 వరకు వసూలు చేస్తున్నారు ,కొత్తగూడ , గంగారాం ప్రాంతాల్లో గిరిజనేతరులు వేళ ఎకరాల్లో సాగు చేస్తున్నా మాట వాస్తవం , దీనితో ఆ ప్రాంతంలో వ్యవసాయం లాభసాటి వ్యాపారం గా మార్చుకొని అటు వాణిజ్య పంటలు పండిస్తున్నారు . ఈ పంటలకు కావాల్సిన నిరంతర సాగు నీటి కోసమే ఈ బోరింగ్ లు వేయడం జరుగుతుందని ఆదివాసీ గిరిజనులు అనుకుంటున్నారు , అయితే బోరింగ్ వేయించుకునేవారిలో షెడ్యూల్ ప్రాంతాల్లో వుండే ఆదివాసీ గిరిజనులు లేకపోవడం కొసమెరుపు ,. కనుమరుగుఅవుతున్న ,”పీసా 1970. “షెడ్యూలు ఏరియాలో బ్రతికే ఆదివాసీ గిరిజనుల కోసం 1970 లో ఏర్పాటు చేసిన గిరిజన చట్టం ఈ ప్రాంతాల్లో మాత్రం నిరాదరణకు గురైంది , వాటిని పకడ్బందీగా అమలు చేయవల్సిన ఫారెస్ట్ , రెవిన్యూ అధికారులు మాత్రం తమకు తెలియనట్టే వ్యవహరిస్తున్నారు జిల్లా లో గతంలో ఏజెన్సీ ప్రాంతాల్లో వందల కొద్దీ ఫారెస్ట్ భూములను పోడు చేసి సాగు చేసుకొని గత ప్రభుత్వం లో అధికారులను ప్రజ ప్రతినిధులను



# కానరాని ఆర్థిక పునరుత్తేజం !



ఆర్థిక పునరుత్తేజం కోసం భారత రిజర్వ్ బ్యాంక్ వేసుకున్న లెక్కలు తలకిందులు అయ్యాయి. క్షీణిస్తున్న రూపాయి విలువతో ఈ ఏడాది ఆసియాలోకెల్లా బాగా దెబ్బతిన్న కరెన్సీ ఇప్పుడు మనదేననడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక, స్టాక్‌మార్కెట్ కష్టాలు సరేసరి. ఈ మధ్య అవి కూడా తలకిందులు అవుతున్నాయి. భారత్ ఇప్పుడు ఆర్థిక, వాణిజ్య లోటులు రెంటినీ ఎదుర్కొంటోంది. జాతీయ, అంతర్జాతీయ ధరలు పెరుగుతుండడంతో దేశంలో ద్రవ్యోల్బణంపై తన వైఖరిని భారత రిజర్వ్ బ్యాంక్ పునఃసమీక్షించు కోవాల్సిన అవసరం ఏర్పడింది. ధరలు ఇలానే పెరుగుతూ పోతే, వృద్ధిపై గట్టి దెబ్బ పడుతుంది. ఆర్బీఐ తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టడం ద్వారా రూపాయి విలువ మరింత పడిపోకుండా చూడాలి. ప్రజల్లో ఆర్థిక లావాదేవీలు పెరగాలి. సత్వర కార్యాచరణ చేపట్టడం ద్వారా ప్రజలకు పనులు కల్పించే పనులు చేయాలి.ప్రజల్లో రూపాయి చలామణి అయ్యేలా చేయాలి. ఉత్పత్తి రంగాలకు ప్రోత్సాహం ఇవ్వాలి. ధాన్యం నిల్వలు ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా చేస్తే తప్ప ఆర్థిక రంగం బలపడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే దేశంలో ఆర్థిక విధానాలు నానాటికి దిగజారుతున్నాయి. కేవలం పన్నులు మీద ఉన్న శ్రద్ధ మరోదానిపై కనిపించడం లేదు. ప్రతిదీ పన్నుల కింద జమకట్టం, బ్యాంకుల వడ్డింపులు, వడ్డీల తీరు కారణంగా సామాన్యులకు జీవించడం కష్టంగా మారుతోంది. ప్రభుత్వం ఉన్నది పన్నులు వసూలు చేయడానికి తప్ప ప్రజల కోసం కాదని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రుజువు చేసుకున్నాయి. డిల్లీలో కూర్చుని లెక్కలు వేయకుండా ప్రజల ఆర్థిక స్థితిగతులను లెక్కలు వేస్తే ఆర్థిక పరిస్థితి ఏంటన్నది చూడాలి. బంగారం కొనడానికి లేదు. పుస్తెలు చేయించాలంటేనే భయపడే రోజులు దాపురించాయి. అదేపనిగా బంగారం,వెండిధరలు పెరిగి పోతున్నాయి. భూములు అందుబాటులో లేవు. అలాగే ఇళ్లు కట్టుకునే వీలు లేదు. ఆహార ధాన్యాలు కొనే ధైర్యం లేదు. తిండి తినడం కూడా భయంగా మారింది. బ్యాంకులు ఎగవేతదారులను వదిలి సామాన్యుల వెంట పడుతున్నాయి. ఇలా అన్ని విధాలా ధరలు పెరిగిపోతున్నా..పాలకులు పట్టించు కోవడం లేదు. సరికదా అభివృద్ధికి ఇదే సూచిక అని చంకలు గుద్దుకుంటున్నారు పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలు కూడా ప్రజల జీవనంపై తీవ్రప్రభావం చూపుతోంది. ఉక్రెయిన్ యుద్ధ ప్రకంపనలు ప్రపంచమంతటినీ తాకుతున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు కూడా మనపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అక్కడి సెగ ఇక్కడి మన స్టాక్ మార్కెట్లు, మదుపరులు, ఆర్థిక విధాన నిర్ణేతలు ఇలా ప్రతి ఒక్కరికీ తగులుతోంది. భారత ఆర్థిక వ్యవస్థపై భారం పడనుంది. ఇప్పటికే స్టాక్ మార్కెట్ల పతనం, ఎన్నడూ లేనట్టు డాలర్‌కు 85 రూపాయల స్థాయికి కరెన్సీ విలువ క్షీణించడం, పెరగనున్న చమురు ధరలు వెక్కిరిస్తున్నాయి. అనేక అవాంతరాల మధ్య క్రమంగా కోలుకుంటోందని భావిస్తున్న దేశ ఆర్థికరంగం రానున్న రోజుల్లో ఇంకెంత ఒత్తిడికి గురవుతుందోనని ఆందోళన కలుగుతోంది. ద్రవ్యోల్బణం పెరుగుతుండడం మన ఆర్థిక విధాన నిర్ణేతలకు సవాలు కానుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కూడా పడిపోతోంది. చమురుకు తోడు వంటనూనెలు ఉన్నాయి. ప్రపంచం లోసన్‌ఫ్లవర్ నూనెలో అయిదింట నాలుగొంతులు రష్యా, ఉక్రెయిన్‌ల ఉత్పత్తి కావడం గమనించాలి. మన సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతుల్లో 90 శాతం ఆ రెండు దేశాల నుంచే వస్తాయి. పామాయిల్, ఆవనూనెల ధరలు ఇప్పటికే పైకి చూస్తున్నాయి. మన దగ్గర ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నా వాణిజ్య పరంగా వాటిని ఎగమతులు చేసుకునే వ్యూహాలు కానరావడం లేదు. పసుపు, మిర్చి,అల్లం, వెల్లుల్లి, బియ్యం, పత్తి వంటి వాణిజ్య పంటలను అత్యధికంగగా ఎగుమతి చేసుకునే విధానాలు రూపొందాలి. మన ఎగుమతులను సమీక్షించకుండా అదే పనిగా దిగుమతులు పెరిగితే ద్రవ్యోల్బణం పెరగడమే గాకుండా రూపాయి మారకవిలువ కూడా పెరగడం ఖాయం. వంటనూనెలు మరింత ప్రియం కానున్నాయి. కీలకమైన ఈ ఇంధనాల ధరలు ఇలా పెరిగిపోతుండడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుంది. ధరలు ప్రజల శక్తికి మించి పెరుగుతున్న చోట సామాజిక సంక్షోభం తలెత్తనుంది. నిత్యావసర సరకులు కొనుక్కోలేని అశక్తత ఏర్పడి అది అశాంతిని సృష్టించి వీధుల్లో అలజడికి కారణం అవుతుంది. ఈ కారణంగగా మన దేశీయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయడం తప్పనిసరి. అలాగే ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా ఆర్థిక కార్యకలాపాలు సాగాలి. ఎగుమతులను పెంచాలి. ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంచాలి. అమ్మకాలతో లాభం లేదని గుర్తించాలి. ఇవేవీ చేయ కుండా ఎన్ని కసరత్తులు చేసినా లాభం లేదని గమనించాలి. ఆర్తిక వ్యవస్థ చిన్నాభిన్నం కాకముందే పాలకులు మేల్కోవాలి. లేకుంటే పరిస్థితి సామాజిక సంక్షోభానికి దారితీయగలదని గుర్తించాలి. మనం పండిస్తున్న మిర్చి, పసుపు, పత్తి లాంటి పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించాలి. ఇక్కడి ఉత్పత్తులు ప్రజలకు చేరాలి. ప్రభుత్వం సరైన మార్కెంటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. బ్యాంకుల వడ్డీ రేట్లు తగ్గితే తప్ప రియల్ రంగం పుంజుకోదు. ఇవన్నీ ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే తప్ప ఆర్థికరరంగం గాడిన పడదు.

# మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్

**ప్రమాదంలో గాయపడ్డ యువతి**

**హైదరాబాద్,మార్చి25:** హైదరాబాద్‌లోని బాలనగర్ పరిధిలో హిట్ అండ్ రన్ కేసు సంచలనం రేపింది. మద్యం మత్తులో ఓ యువకుడు ఫార్చునర్ కారుతో యువతిని బలంగా ఢీకొట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనలో 19 ఏళ్ల యువతి సాయి కీర్తి తీవ్రంగా గాయపడింది. మంగళవారం ఉదయం బాలనగర్ ఐడీపీఎల్ చౌరస్తాలో ఈ ఘటన జరిగింది. ఫార్చునర్ కారులో అతివేగంగా ప్రయాణిస్తున్న యువకుడు మద్యం మత్తులో ఉండటంతో అదుపుతప్పి రోడ్డుపై నడుస్తున్న సాయి కీర్తిని ఢీకొట్టాడు. అయితే, ఆక్సిడెంట్ చేసిన వెంటనే కారు ఆపకుండా అక్కడి నుంచి పరుగుతీశాడు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు నేరుగా సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

**విలేకరులు కావలెను**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

జిల్లా బ్యూరో చీఫ్‌లు | జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌లు
నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు | మండల రిపోర్టర్‌లు

సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :
8328649322, 9398236146.



# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

బుధవారం 26 మార్చి 2025 పేజీలు 2


## బిర్యానీ సెంటర్‌లో భారీ పేలుడు

**నల్లగొండ క్రైం, మార్చి 25 :**
నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ బిర్యానీ సెంటర్‌లో సోమవారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. పేలుడు ధాటికి బిర్యానీ సెంటర్ షట్టర్, గేటు సహా లోపల సామాన్లు అన్నీ రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. నల్లగొండ టూ టౌన ఎస్‌ఐ ఎర్ర సైదులు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంజాన మాసం ప్రారంభం కావడంతో నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో పూజిత అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న హాట్ బకెట్ బిర్యానీ సెంటర్‌లో సోమవారం అర్ధరాత్రి వరకూ తెరిచే ఉంది.




- ఎదురు చూస్తున్న రైతులు
- సీజన్ గడిచిపోతున్నా పూర్తిస్థాయిలో అందని పెట్టుబడి సాయం
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 11లక్షల మందికి పైగా రైతులు

**నల్లగొండ, మార్చి 25 :**
రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసాను నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో రైతుల ఖాతాలో జమ చేస్తామని పలుమార్లు ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రైతు భరోసాను ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 26న లాంఛనంగా ప్రారంభిం చింది. ఈ రోజున పైలెట్ ప్రాజెక్టుగా మండలానికో గ్రామం చొప్పున ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 73 గ్రామాలను ఎంపిక చేసి నూరుశాతం రైతుభరోసాను అమలు చేసింది. ఆ తరువాత కొందరి రైతులకే రైతుభరోసా అందింది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి రైతుకు ఎంత భూమి ఉన్నా 11సార్లు రైతుబంధును అమలు చేసింది. అప్పట్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సుమారు ప్రతీ సీజన్‌లో రూ.1,450కోట్లకు పైగా రైతుబంధు వచ్చేది. ప్రస్తుతం 11లక్షల మందికి పైగా రైతులకు గతం మాదిరిగా ఎకరాకు రూ.6 వేల చొప్పున ఏటా రెండు సీజన్లకు రూ.12వేలు చెల్లిస్తే ప్రభుత్వంపై మరింత భారం పడే అవకా శం ఉంది. ఈ పరిస్థితుల్లో తక్కువ భూమికే రైతుభరోసా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందా? లేదా? ఇప్పటికే చెప్పిన విధంగా సేద్యం చేస్తున్న భూమి అంతంటికీ రైతుభరోసా కల్పిస్తుందా? అనేది వేచిచూడాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన, ఉమ్మడి జిల్లాలోని 73 గ్రామాల్లో, ఎంత సాగు భూమి ఉన్నా పూర్తి స్థాయిలో పెట్టుబడి సాయాన్ని చెల్లించింది. అనంతరం మూడు ఎకరాల వరకు రైతుభరోసా నగదును రైతుల ఖాతాల్లో జమచేసింది. ఆ తరువాత ఎన్ని ఎకరాలకు రైతుభరోసా ఇస్తామనే దానిపై ప్రభు త్వం స్పష్టత ఇవ్వకుండా గందరగోళంలో పడేసింది. చివరికి సాగులో ఎంత భూమి ఉన్నా రైతుభరోసా ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం దీనికి సంబంధించిన నగదు చెల్లించకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం గుట్టలకు, చెట్లకు, పుట్టలకు, రోడ్లకు, ఇటుక బట్టీల స్థలాలకు, వెంచర్ల స్థలాలకు రైతుబంధు పేరుతో డబ్బును వృ థా చేసిందని నాడు కాంగ్రెస్ ఆరోపించింది.

### అభిప్రాయాలు సేకరించినా..

గత పార్లమెంటు ఎన్నికల ముందు బీఆర్ఎస్ అమలు చేసిన రైతుబం?ధును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేసింది. అయితే ఆ తరువాత ప్రభుత్వం రైతుభరోసాపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఎన్ని ఎకరాలకు రైతుభరో సా ఇవ్వాలనే దానిపై అభిప్రాయం సేకరించిన ప్రభు త్వం దాన్ని ఆటకెక్కించింది. అభిప్రాయాలపై అసెంబ్లీ లో చర్చ పెట్టి అమలు చేస్తామని ప్రకటించిన ప్రభు త్వం దీనిపై అసెంబ్లీలో చర్చను సైతం పక్కన పెట్టిం ది. రైతుల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో ప్రభుత్వం జనవరి 26న రైతుభరోసా ప్రక్రియను ప్రారంభించినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. దీంతో వ్యవసాయ సీజన్‌లో రైతులు పెట్టుబడుల కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక కొత్తగా పాస్‌పుస్తకాలు వచ్చిన రైతులకు కూడా రైతుభరోసా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వారు దరఖాస్తులు చేసుకున్నారు. వారితో పాటు పాస్‌పుస్తకాల్లో చేర్పులు, మార్పులు చేసుకున్న వారికి ఎకరం, రెండు ఎకరాలు, మూడు ఎకరాలు ఉన్న రైతులకు కూడా పెట్టుడిసాయం అందలేదు.



# పంట తడి.. రైతు కంటతడి

> పంటలను కాపాడుకునేందుకు రైతులు నీటిని కొనుగోలు చేస్తున్నారు. నోటికాడికొచ్చిన పంట ఎండిపోతుండటం చూసి తట్టుకోలేక తడి ఇస్తే పంట చేతికి వస్తుందని ట్యాంకర్లతో మడులు తడుపుతూ అప్పులపాలవుతున్నారు. ఒక తడి తర్వాత మరో తడి ట్యాంకర్లతో నీరు కొనుగోలు వరి పంటకు పోస్తున్నారు.

**మోత్కూరు :** యాదాద్రి భువనగిరి జిల్లాలో కొంతమేర మూసీ నీరు అందుతుండగా మిగతా మండలాలు బావులు, బోర్లపై ఆధారపడి రైతులు సాగుచేస్తున్నారు. ఆలేరు, గుండాల, మోత్కూరు, అడ్డగూడూరు మండలాల్లోని కొంతభాగం బిక్కేరు వాగు వెంట ఉండటంతో చేతిబోర్లతో పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది (2024-25) వర్షాలు లేక చెరువులు, కుంటలు నిండలేదు. బిక్కేరు వాగు పారలేదు. బీమలింగంకాల్వ సౌకర్యం ఉన్నా కూరెళ్ల, పాలడుగు చెరువులు కూడా నిండలేదు. దీంతో బావులు, బోర్లలో భూగర్భ జలాలు తగ్గాయి. సాగునీరు ఉన్నంత మేరకే వరి సాగు చేశారు. గతంలో నాలుగు ఎకరాలు సాగు చేసే రైతు ఈ యాసంగిలో ఒకటిరెండు ఎకరాలే పంట వేశాడు. ఎకరాకు రూ.25 వేల పెట్టుబడి పెట్టాడు. ముదురుతున్న ఎండలతో భూగర్భజలాలు తగ్గి వేసిన కొద్దిపాటి పంట కూడా ఎండిపోతోంది. వరి ఈని, అగ్రవంచుతున్న దశలో ఎండిపోతున్న పంటను వదిలిపెట్టలేక ఒక తడి ఇస్తే పంట చేతికి వస్తుందన్న ఆశతో పలువురు రైతులు ట్యాంకర్లతో నీరు పోసి కాపాడుకునే ప్రయ త్నం చేస్తున్నారు. ఒక్కో రైతు ట్యాంకర్ల కొద్దీ నీటిని కొనుగోలు చేసి పోస్తూ అప్పులపాలవుతున్నారు.

### ట్యాంకర్ నీటితో పారేది రెండు, మూడు గుంటలు..

కొందరు రైతుల వరి పంట చిరుపొట్ట దశలోనే ఎండిపోయింది. వరుస తడులకు తిప్పుతూ పారించిన దాంట్లోనూ కొంత ఈని, గొలుసులు(గింజలు) దశలో ఎండిపోతోంది. ఒకట్రెండు తడులు ఇస్తే పంట చేతికి వస్తుందని భావించిన రైతులు ఒకరిని చూసి మరొకరు తడులు ఇస్తూనే ఉన్నారు. తీరా లెక్క చూసుకుంటే ఎకరాకు రూ.20వేల నుంచి 30 వేల ఖర్చువస్తోంది. ట్యాంకర్ నీటికి రూ.150, పొలం వద్దకు ట్రాక్టర్ రవాణా చార్జి రూ.500 నుంచి రూ.600. మొత్తం ఒక్కో ట్యాంకర్‌కు రూ.650 నుంచి రూ.750 ఖర్చవుతోంది. వరి చేను నీళ్లమీద ఉన్నప్పుడు పోస్తే 8ట్యాంకర్లకు ఎకరం పారుతోంది. ఎండిన తర్వాత పోస్తే ఒక్కో ట్యాంకరుకు 2, 3 గుంటలే పారుతుందని రైతులు చెబుతున్నారు.

# కోరిన కోర్కెలు తీర్చే
# "కొండలమ్మ"



**రామప్ప దేవాలయాన్నిపోలిన ఆలయం**

**అంతరించిపోతున్న కాకతీయుల శిల్ప కళ వైభవం**

**ప్రకృతి రమణీయతకు ఆలవాలం...**

**-కాకతీయులు నిర్మించిన ఆలయాన్ని కాపాడండి**

**-దేవాదాయ శాఖ సహకరించి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి**

**-పిన్నిరెడ్డి గూడెం గ్రామస్తులు లక్ష్మారెడ్డి**



**తొవ్వ,గార్ల మార్చి25**

కాకతీయులు పాలన అంటేనే గుళ్ళు చెరువులు , వృక్ష సంపద ప్రకృతి రమణీయత కు ఆలవాలం నిర్మించిన అనేక ఆలయాలు ఆనాటి సామజిక స్థితిగతులను తెలియజేస్తుంధీ , వేయి స్తంభాల దేవాలయం నుంచి మొదలు ఏ దేవాలయం చుసిన వారి నిర్మాణ కౌశల్యం బయట పడుతుంది , ఒక ఆలయానికి ఇంకో ఆలయానికి ఎటువటిని పోలికలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు , కానీ రామప్ప దేవాలయం నిర్మించిన రేచర్ల రుద్రా సేనాని ఆ ఆలయాన్నినిర్మించడానికి ప్రేరణగా కొండలమ్మ దేవాలయమే స్ఫూర్తి అని నాటి శాసనాలు తెలియజేస్తున్నాయి అంత మహిమాన్విత ఆలయం నేడు కాలగర్భంలో కలిసిపోయిన ఆదివాసీ గిరిజనులు , ప్రజలు నేటికీ అమ్మలనూ కొలుస్తునేవున్నారు .ఆదిశక్తి అవతరణ అమ్మలు నేటికీ పాములా రూపంలో భక్తులకు ఉగాది రోజు దర్శనమ్ ఇస్తున్నాయ్ భక్తులకు కోరిన కోర్కెలు తీర్చే "కొండలమ్మ " కాకతీయుల ఆడపడుచు "బయ్యమాంబ" చెరువు రూపంలో , గ్రామాని కాపాడే "గారమ్మ" గా ముగ్గురు దేవతలు ఈ ప్రాంత ప్రజల మదిలో అనునిత్యం ప్రేరణే

**జాతరకు సిద్ధం ..**

, మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పిన్నిరెడ్డి గూడెంలో ప్రతి ఏడు ఉగాది రోజున నిర్వహించే కొండలమ్మ జాతరకు ఈ సంవత్సరం సర్వం సిద్ధం చేసినట్టు ఆలయ చైర్మన్ బీరవెల్లి లక్ష్మారెడ్డి తెలిపారు. కాకతీయుల కాలంలో అలనాడు 11 వ శతాబ్దంలో ప్రతాపరుద్రుడు నిర్మించిన కొండలమ్మ దేవాలయం చాలా ప్రసిద్ధిగాంచి నిత్య పూజలు అందుకుంటుందని అయన అన్నారు. ఆనాడు

మొదటి ప్రతాపరుద్రుడు కొండమ్మ, గారమ్మ, బయ్యమ్మలుగా దేవతలను కొలిచేవారని వారి పేర్లతో పిన్నిరెడ్డి గూడెంలో చెరువుకు కొండలమ్మ చెరువు అని ,సీతంపేట గ్రామంలోని పెద్ద చెరువుకు గార్ల చెరువు అని, బయ్యారం చెరువుగా పేర్లు పెట్టుకుని గంగదేవిని కొలిచేవారని వారి ఇంట్లో పుట్టిన ఆడపిల్లలకు ఆయా దేవతల పేర్లు పెట్టరని , చరిత్ర చెబుతుంది, ప్రకృతిని పూజిస్తూ చెరువులపై జీవనాధారంగా చేసుకున్న రైతులు ప్రతి ఏటా పండే పంటలో కొంత పంటతో ఆ దేవతలకు పరమాన్నం ప్రసాదించేవారని, అలాగే ప్రతీ ఏటా ఉగాది పర్వదినాన మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పిన్నిరెడ్డి గూడెం గ్రామంలో నాలుగు రోజులపాటు ప్రత్యేక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. పిన్నిరెడ్డి గూడెం గ్రామస్థులే కాక ఉమ్మడి జిల్లాల ప్రజలు,విదేశాల్లో స్థిరపడిన వారు కూడా కొండలమ్మ దీవెనలు అందుకునేందుకు తండోపతండాలుగా తరలి వస్తు ముమ్మరంగా జాతరలో పాల్గొంటున్నారన్నారు. ఐతే 11వ శతాబ్దంలో నిర్మంచిన కొండలమ్మ దేవాలయం శిథిలావస్థకు చేరి రోజు రోజుకూ ఒక్కో రాయిగా అంతరిస్తూ ఆలయ రూపురేఖలు మారుతూ అంతరించి పోతుంటే గత 50 ఏళ్లుగా గ్రామస్తులు కాపాడుతూ తలో ఇంత అన్న కోణంలో అభివృద్ధి చేస్తూ గుడిని కాపాడుతున్నట్టు గ్రామస్థులు తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లి కొండలమ్మ అని వారి నమ్మకం. ఆ ఊరిలో ఇంటికొకరికైనా కొండలమ్మ పేరుతో కలిసివచ్చేలా కొండల్, కొండలయ్య, కొండలమ్మా అని పేర్లు కూడా పెట్టుకుంటారని అన్నారు. పాడి పంటలు, పిల్లలు లేనివారికి సంతానం, ఆరోగ్య సమస్యలపై ఏది కోరునా తల్లి దివేనాలతో తప్పక కోరికలు నెరవేరుతాయని వారి నమ్మకం. ప్రతీ ఏటా అక్కడి ఆలయానికి రెండు నాగు పాములు వచ్చి ఆ నాలుగు రోజులపాటు అక్కడి ఆలయంలో దర్శనమిస్తూ వచ్చిన భక్తులను దివిస్తాయని మరుసటి రోజున ఆ నాగులు మాయమై మళ్ళీ మరుసటి సంవత్సరం దర్శనమిస్తాయని వారు తెలిపారు. ఐతే ప్రతి ఏటా జరిగిన విధంగా జాతర జరుపుతూ ఆలయాన్ని కాపాడుతుంటే ప్రతి ఏడాది 4రోజులు జరిగే జాతరకు 50వేలకు పైగా భక్తుల ఆదరణ ఉన్న ఆలయాన్ని దర్శించుకుంటున్న అమ్మవారి దేవాలయాన్ని దేవాదాయ శాఖ, ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై గ్రామ పెద్దలు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ప్రతి ఏటా ఆ సమయంలో ప్రభుత్వాన్ని పరిపాలించే ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, జిల్లా రాష్ట్ర స్థాయి అధికారులు అమ్మవారి దీవెనలు తీసుకుంటున్నారే తప్ప దేవాలయ అభివృద్ధి గురించి ఆలోచించలేదని అన్నారు. ఏటా ఏటా భక్తులు పెరుగుతున్న విషయాన్ని పరిగణలోకి తీసుకునైనా ఆలయ అభివృద్ధి పై ఆలోచన జరపాలని కోరుతున్నారు. ఈ నెల28 ఎడ్ల బండ్ల ప్రభాలల ఊరేగింపు, 29న పూర్ణకుంభంతో దేవతారాధన, 30న నైవేద్యాల సమర్పణ, మహాజాతర, 31న సంకృతిక కార్యక్రమాలు భజన కార్యక్రమలను భక్తులంతా అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటి సభ్యులు కోరారు. వారిలో ఆలయ కమిటీ చైర్మన్ బుర్లమల్లేషం, పుణెం వెంకన్న,పెంట్యాల శ్రీనివాసరావు, పి ఎల్లయ్య,పి రమణ,జలగం కొండయ్య, కె కొండల్ రావు,చింత ఎల్లయ్య,మోతీలాల్, ఎ రాజేష్,నరసింహ,నారాయణ రెడ్డి,అప్పి రెడ్డి,కమిటీ సభ్యులు తదితరులున్నారు.

